క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



ఊయలసేవలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలు



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళా వేదికపై వనపర్తికి చెందిన సత్యం, బృందం వారి భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. నమామి విఘ్నేశ్వర, ఎవరికి ఎవరయ్యా ఈశ్వరా, నల్లమల కొండల్లో, శంకరా నాథా, ఓం నమఃశివాయా, శ్రీశైలగిరి యందు, శ్రీశైలమల్లన్నా తదితర గీతాలను సత్యంస్వామి, శివశంకర్, శేఖర్, కృష్ణచైతన్య, నాగరాజు, పరమేశ్వర్ తదితరులు ఆలపించారు.

నూతన విద్యుత్ మోటారు ఏర్పాటు



కొత్త విద్యుత్ మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో రూ.1.50 లక్షల ఎంపీపీ నిధులతో 5హెచ్‌పీ సామర్థ్యం విద్యుత్ మోటారు, పైపులు, స్టాటర్ ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న 5హెచ్‌పీ మోటారు పదేపదే కాలిపోతుండటంతో గ్రామంలో నీటి సమస్య ఏర్పడేది. నూతన మోటారు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపినట్లు సర్పంచు వరప్రసాదరావు శుక్రవారం తెలిపారు.

పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

వెలుగోడు: మండల పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. స్థానిక పశు వైద్యశాలలో ఏడేళ్లుగా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ధనుంజయుడు కర్నూలు జిల్లా ఆలూరుకు బదిలీ అయ్యారు. కడప జిల్లా రాజుపాలెంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెలుగోడుకు బదిలీపై వచ్చారు. అలాగే రేగడ గూడూరులో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జ్యోత్స్నదేవి బండి ఆత్మకూరు మండలం పార్నపల్లి బదిలీ అయ్యారు.

కౌలు రైతుకు మొండిచేయేనా?

- అన్నదాత సుఖీభవ అమలుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- కౌలు రైతులను పట్టించుకోని వైనం

బండిఆత్మకూరు: కౌలు రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కూటమి ప్రభుత్వం పథకం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుండగా అందులోనూ కౌలు రైతులను విస్మరిస్తున్నట్లు సమాచారం. పెట్టుబడి సాయాన్ని కౌలు రైతులకు కాదని యాజమాన్య రైతులకే అందించేలా ఏర్పాట్లు చేస్తుండటంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాడు భరోసా

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పట్లో రైతులతో సమానంగానే కౌలు రైతులకూ పెట్టుబడి సాయాన్ని అందించింది. కేంద్రమిచ్చే రూ.6 వేలతో పాటు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.7500ను కలిపి రూ.13,500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో వారి ఖాతాలకే జమ చేసింది. కౌలు రైతులకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో వాటిని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించింది.

హామీ నీటిమూటేనా?

గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు హామీలతో ఊదరగొట్టాయి. తాము అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 6వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.14 వేలను కలిపి రూ.20 వేలను రైతులతో పాటు కౌలు రైతు లకూ అందిస్తామని హామీ ఇచ్చారు. సీసీఆర్ కార్డులు చేయించుకోండి, నగదును జమ చేస్తామని చెప్పడంతో కౌలు రైతులంతా వీటిని పొందారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలను ఈ ఏడాది అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితాలను ప్రదర్శించారు. వీరందరూ ఈ కేవైసీని చేయించుకోవాలని సూచించింది. శ్రీశైలం నియోజకవర్గంలో 2,965 మంది మంది కౌలు రైతులున్నారు. వీరందరూ గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం కింద నగదు పొందారు. ప్రస్తుతం కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడంతో పాటు సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్ నేటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో కౌలు రైతులకు ప్రభుత్వం మొండి చేయి చూపనుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వెంగళరెడ్డిపేటలో సాగు చేస్తున్న వరినారు

సమాచారం లేదు

అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. కౌలు రైతులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదు. ఈ విషయంలో స్పష్టత లేదు.

– పవనకుమార్, వ్యవసాయాధికారి, బండిఆత్మకూరు

పెట్టుబడి సాయం ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతులకూ రూ.20 వేలను పెట్టుబడి సాయంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో దీని కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే అప్పులు చేసి సాగును ప్రారంభించాం. పెట్టుబడి సాయాన్ని అందిస్తే అప్పు తీర్చుకోవచ్చని ఆశపడ్డాం. అయితే ఈ ప్రభుత్వ వైఖరి చూస్తుంటే అనుమానంగా ఉంది.

– దూదేకుల జమాల్, కౌలు రైతు, పెద్దదేవళాపురం

ప్రభుత్వమే ఆదుకోవాలి

ధాన్యం ధరలు దయనీయంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పెట్టుబడి సాయాన్ని అందిస్తే కొంత ఊరట లభిస్తుంది. అయితే కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకురాలేదు.

– దేవిలాల్, కౌలు రైతు లింగాపురం

నీటి పన్ను వసూలు చేయాలి

వెలుగోడు: తెలుగుగంగా, కేసీ కెనాల్, బోరుబావుల కింద మెట్ట భూముల్లో సాగు చేస్తున్న రైతుల నుంచి నీటి తీరువా పన్ను వసూలు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసగౌడు ఆదేశించారు. శుక్రవారం గ్రామాల్లో దండోరా వేయించారు. కాలువల ద్వారా నీటిని పంటల సాగుకు వాడుకుంటున్న రైతుల నుంచి బకాయి పడ్డ పన్నులను వీఆర్‌ఓలు వసూలు చేస్తారని, రైతులు పన్ను చెల్లించి అధికారులకుసహకరించాలని కోరారు.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోండి

పగిడ్యాల: దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం నందికొట్కూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించే సహాయ పరికరాల ఎంపిక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని దివ్యాంగులు, వయో వృద్ధులకు నిర్వహించే శిబిరంలో అర్హులైన వారికి మూడు చక్రాల సైకిల్, ఊత కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు ఇవ్వనున్నట్లు చెప్పారు.

వాహనాల తనిఖీ

వెలుగోడు: పట్టణ శివారులోని ఎస్ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ వద్ద ఆత్మకూరు–నంద్యాల ప్రధాన రహదారిలో ఎస్ఐ సురేష్ శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై నడిపిస్తున్న వాహనాలకు జరిమానా విధించినట్లు ఎస్ఐ చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని వాహనదారులకు అవగాహన కల్పించారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గొర్రెలకు డీవార్మింగ్ మందు తాపుతున్న వీఎల్వో శ్రీనివాసులు

పగిడ్యాల: వర్షాకాలం ప్రారంభమైనందున మేకలు, గొర్రెల పెంపకం దారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విలేజ్ లైవ్‌స్టాక్ ఆఫీసర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం నెహ్రూనగర్‌లో గొర్రెలకు డీవార్మింగ్(నట్టల నివారణ మందు) తాపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల్లో సాధారణంగా జొల్లు రోగం, పారుడు, బ్లూ టంగ్ తదితర రోగాలు బారిన పడే అవకాశం ఉందని, చెరువులు, కుంటల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు తాగడం వల్ల కడుపులో నులి పురుగులు ఏర్పడి జీవాలు మృతి చెందే ప్రమాదం ఉందన్నారు. కాపరులు తప్పనిసరిగా జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలని సూచించారు. అనంతరం 800 గొర్రెలకు మందు తాపారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల, పారుమంచాల గ్రామాల్లో శుక్రవారం పశు వైద్యుడు శ్రవణ్‌కుమార్ జీవాలకు ఉచితంగా నట్టలనివారణ మందు తాపించారు. మండలంలోని 27,500 జీవాలకు జూలై 10 వరకు నట్టలనివారణ మందు వేయనున్నట్లు ఆయన చెప్పారు.

నీటి పన్ను చెల్లించాలి

ఆత్మకూరు: రైతులు సకాలంలో నీటి పన్ను చెల్లించాలని తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. శుక్రవారం కరివేన గ్రామంలో రైతులతో ఆమె సమావేశమయ్యారు. సాగునీటి బకాయిల రైతులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, వెంటనే సచివాలయానికి వెళ్లి చెల్లించాలని తహసీల్దార్ సూచించారు.

రుణాలు త్వరగా చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు మహిళలు స్త్రీనిధి, ఉన్నతి పథకాల్లో తీసుకున్న రుణాలను త్వరితగతిన చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డీఆర్‌డీఏ పరిధిలో పని చేస్తున్న డీపీఎం, ఏపీఎం, ఎల్‌సీ, జిల్లా సమాఖ్య, ఓబీ, ఈసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రుణాలు వసూళ్లపై ఏపీఎంలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే పొదుపు గ్రూపులలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రుణాలు తీసుకుంటూ ప్రతి నెల సక్రమంగా చెల్లించే విధంగా చూడాలన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కోర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, లైఫ్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ తదితర విభాగాల్లో 35 రోజుల పాటు ఉచిత భోజన వసతి సదుపాయాలతో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వయస్సు, పది ఆపై చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తనఖా లేకుండా వ్యవసాయ రుణాలు

కోవెలకుంట్ల: కెనరా బ్యాంకు ద్వారా రైతులకు తనఖా లేకుండానే వ్యవసాయయ రుణాలు అందజేస్తున్నామని ఆ బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ మీతాంతయ తెలిపారు. పట్టణంలోని నాగుల కట్ట సమీపంలో కెనరా బ్యాంకు నూతన బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా బ్యాంకు కర్నూలు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, చీఫ్ మేనేజర్ మనోహర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ వాసగిరి సాయికృష్ణమూర్తి, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. రైతులకు బ్యాంకు ద్వారా గతంలో రూ. 2.50 లక్షల వరకు వ్యవసాయ రుణాలు అందించేవారని, ఆ మొత్తాన్ని రూ. 3 లక్షలకు పెంచామన్నారు. మినిమమ్ బ్యాలెన్స్ లేకున్నా ఎలాంటి అపరాధ రుసుం చెల్లించకుండానే సేవింగ్స్ ఖాతాను కొనసాగించుకునే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులకు రూ. 10 లక్షల వరకు క్యాన్సర్ కేర్ ఇన్సూరెన్స్, రూ. 26 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. బ్రాంచ్ మేనేజర్ సద్దాం అలీ, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సంజామలలో కెనరా బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

సంజామల: మండల కేంద్రంలో కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. బ్యాంకు సేవలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సర్కిల్ జనరల్ మేనేజర్ మీతాంతియా, కర్నూల్ ఏజీఎం సుశాంత్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ తరుణ్ కుమార్ పాల్గొన్నారు.



మసీదుపురం సచివాలయంలో కొందరే హాజరైన దృశ్యం

వారొచ్చిందే సమయం...!

మహానంది: సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు తనిఖీలు చేయకపోవడంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మసీదుపురం సచివాలయ సిబ్బంది శుక్రవారం ఉదయం 11 గంటలు దాటినా విధులకు హాజరు కాలేదు. డిజిటల్ అసిస్టెంట్, డబ్ల్యూఈఏ, ఏఎన్ఎం మాత్రమే కనిపించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

మల్లన్న సేవలో టీపీసీసీ అధ్యక్షులు



మల్లన్న దర్శనం అనంతరం ఆలయం వెలుపుల టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం మల్లన్న దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



చలో కర్నూలు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లింలు

వెలుగోడు: ముస్లింలకు నష్టం కలిగించే వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లిం జేఏసీ నాయకులు జావాద్ మౌలానా, మహబూబ్ రహిమాన్ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 30న కర్నూలులో సేవ్ వక్ఫ్..సేవ్ కానిస్టిట్యూషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ముస్లింలను ఇబ్బంది పెడుతోందన్నారు. కొన్ని పార్టీలు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లింల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నేతలు అబ్దుల్ సలాం, జిక్రియా మౌలానా తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్



కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో శుక్రవారం క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. మల్లికార్జుననాయక్ జ్ఞాపకార్థం కాలో ప్రిమియర్ లీగ్ సీజన్–1 టోర్నమెంట్‌ను వారి మిత్ర బృందం నిర్వహిస్తోంది. 40 జట్లు పాల్గొన్నాయి.

మొదటి బహుమతి కాలో ప్రిమియర్ లీగ్ సీజన్–1 నిర్వాహకులు రూ.1,35,000, రెండవ బహుమతి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్‌రెడ్డి రూ.75,000, మూడవ బహుమతి రూ.40,000 నగదుతోపాటు కప్పును జక్కంపూడి మణికంఠ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జూపాడుబంగ్లా: తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలోని మత్స్యశాఖ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన మత్స్యశాఖ భూములను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 1990లో తంగడంచ ఫారం భూముల్లో భాగంగా 5 ఎకరాల్లో 25 టబ్బులు, ఆరు పక్కాగృహాలు, మోటారు నిర్వహణ గదులు నిర్మించారన్నారు. 20 ఏళ్ల నుంచి మత్స్యశాఖ అధికారులు కేంద్రాన్ని పట్టించుకోకపోవటంతో కొంత మంది భూములను ఆక్రమించుకుని వ్యవసాయ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి భూములను స్వాధీనం చేసుకుని, పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు వేల్పుల ఏసన్న, నరసింహులు, సోమప్ప, స్వాములు, బీబీ, లక్ష్మీదేవి, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో వేద పండితులు, అర్చకులు గంగ, కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు తీర్చారు. బలిహరణ పూజల తర్వాత ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

తాగునీటి పైపు లీకేజీ

- పట్టించుకోని అధికారులు

పాములపాడు: మండల కేంద్రంలో కురువ బాల నాగయ్య ఇంటి వద్ద మలుపులో పైపు లీకేజీని అరికట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. 15 రోజుల క్రితం పైపు లైన్ లీకేజీ అయ్యి నీరు వృథాగా రహదారి వెంట ప్రవహిస్తుండటంతో కాలనీ వాసులు సర్పంచు దృష్టికి తీసుకెళ్లారు. 4 రోజుల క్రితం సిబ్బంది మరమ్మతుల కోసం వచ్చి గుంత తీశారు. పైపులైన్ పాతది కావడంతో రోడ్డు కింద, సుమారు 6 అడుగుల లోతులో ఉందని, దీని వల్ల లీకేజీ ఎక్కడ ఉందో కనిపించలేదని, మళ్లీ వస్తామని చెప్పి వెళ్లిపోయి తిరిగి రాలేదు. నీటి వృథాతోపాటు సిబ్బంది తీసిన గుంత కూడా స్థానికులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీని అరికట్టి, గుంతను పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.



పైపులైన్ లీకవ్వడంతో ప్రవహిస్తున్న నీరు

పిచ్చి మొక్కల మధ్య చేతిపంపు



మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలో నందీశ్వరాలయం వద్ద ఉన్న చేతి పంపు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి అపరిశుభ్రంగా ఉంది. పుణ్యక్షేత్రం వద్ద స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు సమీపంలోని రైతులు, వ్యవసాయ కూలీలు ఈ చేతి పంపు నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. అయితే చేతిపంపు పిచ్చి మొక్కల మధ్య, దిగువన ఉండటంతో విషపురుగుల భయం వెంటాడుతోంది. చుట్టూ శుభ్రం చేయించి సిమెంటు బెడ్డు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. – పాములపాడు

మహిళలను గౌరవించాలి

- డీఎస్పీ రామాంజినాయక్

నందికొట్కూరు: సమాజంలో మహిళలను గౌరవించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ప్రజలకు సూచించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నేరాలపై శుక్రవారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ తిరుపాలు, సర్పంచ్ రామచంద్రుడు, మాజీ సర్పంచ్ సత్యంరెడ్డి, పోలీసులు వెంకటేశ్వర్లు, చెన్నయ్య పాల్గొన్నారు.



వడ్డెమాను గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్


సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి మండలకేంద్రంలోని సంతగేటు ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు.

గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఆధార్, బ్యాంకు, పాన్‌నెంబర్లు అడిగితే ఇవ్వొద్దన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మి వారిచేతుల్లో డబ్బు పెట్టి మోసపోవద్దన్నారు.

దిష్టిబొమ్మగా మినరల్‌వాటర్ ప్లాంటు

జూపాడుబంగ్లా: పీఎంశ్రీ పథకం కింద మోడల్‌పాఠశాలకు మంజూరైన మినరల్‌వాటర్ ప్లాంటు పాఠశాలలో అమర్చకపోవటంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. మోడల్‌స్కూల్ పీఎంశ్రీ పథకం కింద ఎంపికకావటంతో పాఠశాలకు తాగునీటి మినరల్‌వాటర్ ప్లాంటు మంజూరైంది. ప్లాంటును పాఠశాలలో ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి తెచ్చుకున్న లీటరు వాటర్ బాటిల్‌లోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సత్వరమే పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటుచేసి విద్యార్థులకు వాటర్ అందేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వృథాగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంటు